క్లుప్తంగా

జనరల్ ఆస్పత్రిలో అంతర్గత విచారణ

పాలమూరు: ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కుగా ఉండాల్సిన జనరల్ ఆస్పత్రిలో అన్ని రకాల వ్యవస్థలు పూర్తిగా గాడితప్పడం వల్ల సదరు ఆస్పత్రి పనితీరుపై ఓ న్యాయమూర్తి విచారణ చేయడం కలకలం రేపుతోంది. మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో సోమవారం న్యాయమూర్తి అంతర్గతంగా విచారణ నిర్వహించారు. ఇటీవల కాలంలో ఆస్పత్రిలో రోగులకు సంబంధించిన బంగారు ఆభరణాలు, నగదు చోరీలకు గురవుతున్న క్రమంలో మొదట న్యాయమూర్తి సీటీస్కాన్, ఎక్స్‌రే దగ్గర విచారణ చేశారు. ఆ తర్వాత గతంలో నవజాత శిశువులకు సంబంధించి జరిగిన అపహరణ ఘటనలపై న్యాయమూర్తి లోతుగా విచారించారు. అనంతరం ఆర్‌ఎంఓల నుంచి స్టేట్‌మేంట్ రికార్డ్ చేయడం జరిగింది. ఈ విచారణపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీరాను సాక్షి వివరణ కోరగా, గతంలో జరిగిన ఘటనలపై విచారణ చేసినట్లు తెలిపారు.

బెల్ట్‌షాప్ తొలగించాలి

రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండలంలోని ఉడిత్యాల గ్రామంలోని ప్రధాన కూడలిలో గ్రామానికి చెందిన శేఖర్ నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌ను తొలగించాలని సోమవారం ఉడిత్యాల గ్రామ యువకులు కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పాఠశాలకు సమీపంలో ఉందని, బెల్ట్‌షాప్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పించండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వం డబు ల్ బెడ్రూం ఇళ్లు తన కు ఇవ్వాలని స్వాతి కోరారు. సోమవారం అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. వికలాంగురాలైన తనకు ఏ ఆధా రం లేదని పేర్కొన్నారు. ఎన్ని సార్లు అధికారులకు విన్నవించిన ప్రయోజనం లేకుండా పోయిందని, తనకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలని కోరింది.

రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ శారదాబాయి తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ స్టేడియంలో సోమవారం ఉమ్మడి జిల్లా అండర్-17, అండర్-19 విభాగాల ఎస్‌జీఎఫ్ ఉషూ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. మహబూబాబాద్‌లో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని, 8 మంది క్రీడాకారులను ఎంపి చేసినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం



నవాబుపేట: వివాహిత అదృశ్యమైన సంఘటన మండలంలోని పల్లెగడ్డలో చోటు చేసుకుంది. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పల్లెగడ్డకు చెందిన పోమాల నవనీత (23) ను రెండేళ్ల క్రితం వీరాపూర్ గ్రామానికి చెందిన రాఘవేందర్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆమెకు ఒక కుమారుడు ఉన్నాడు. ఆమె పుట్టింటికి పెద్దల పండగ కోసం ఈనెల 21న పల్లెగడ్డకు వచ్చింది. పండగ అనంతరం అందరు కలిసి భోజనం చేసి నిద్రించారు. అర్ధరాత్రి ఆమె కు మారుడు ఏడుస్తుండటంతో ఆమె తండ్రి నిద్రలేని చూసే సరికి కూతురు నవనీత కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల, బంధువుల తో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె తండ్రి పాండయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

భూత్పూర్‌లో..

భూత్పూర్: పట్టణానికి చెందిన మహిళ అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన కావేరి, నరేష్ దంపతులు భూత్పూర్ పట్టణంలో బట్టల దుకాణం నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం సంసారం విషయంలో భార్యాభర్తల మధ్య పొట్లాట జరిగింది. పెద్దలు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమనిగింది. ఈ విషయం కావేరి తమ్ముడు యోగేంద్రకు ఫోన్ ద్వారా నరేష్ చెప్పాడు. ఆదివారం సాయంత్రం భర్త ఇంటికి వెళ్లి చూడగా కావేరి కన్పించలేదు. ఆమె కోసం బంధువులకు, యోగేంద్ర కుమార్‌కి ఫోన్ చేశాడు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో యోగేంద్ర కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

అంబేడ్కర్ కళాభవనం పరిరక్షణ సమితి ఎన్నిక

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాభవనం పరిరక్షణ సమితి (జేఏసీ) ఉమ్మడి జిల్లా పూర్తి స్థాయి కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అందరి ఏకాభిప్రాయం మేరకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా సింగిరెడ్డి పరమేశ్వర్, కో-చైర్మన్లుగా రాయికంటి రాందాస్, మల్లెపోగు శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా సారంగి లక్ష్మీకాంత్, చీఫ్ కో-ఆర్డినేటర్‌గా మూలె కేశవు లు, గౌరవ అధ్యక్షుడిగా కాడం బాలరాజు, అధ్యక్షుడిగా రమేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గడ్డమీది గోపాలకృష్ణ, అధికార ప్రతినిధిగా యాంకి రమేష్, ప్రధాన కార్యదర్శిగా రాజగాని అశోక్‌లను ఎన్నుకున్నారు.

ఘనంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు



మహబూబ్‌నగర్ బాబా మందిరంలో..



లక్ష్మీపల్లిలో..



దేవరకద్రలో..



మహబూబ్‌నగర్ శ్రీరేణుక ఎల్లమ్మవారు



దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



అన్నాసాగర్‌లో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు



మర్లులో..

- బాలత్రిపుర సుందరిదేవి అవతారంలో అమ్మవారి దర్శనం
- పలు చోట్ల కుంకుమార్చన, ప్రత్యేక పూజలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. మహబూబ్‌నగర్ పట్టణంలోని పలు దేవాలయాల్లో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. బస్టాండు సమీపంలోని రేణుకా ఎల్లమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింహగిరిలోని శ్రీకామేశ్వరి సమేత ఐశ్వర్యేశ్వరస్వామి దేవాలయం, జెడ్పీ మైదానం పక్కనున్న శ్రీద్వారకామయి షిరిడీ సాయినాథుని ఆలయం, వీరన్నపేటలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో, శ్రీనివాసకాలనీ పంచముఖిస్వామి దేవాలయంతోపాటు ఇతర ఆలయాల్లో అమ్మవార్లకు పూజలు చేశారు. మర్లులో దుర్గామాతకు కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు సోమిరెడ్డి రమేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మవారి ఆభరణాల ఊరేగింపు..

బ్రాహ్మణవాడిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు స్వర్ణకవచాలంకృత ఉమాదేవి రూపంలో దర్శనమిచ్చారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మిర్యాల వేణుగోపాల్ నివాస గృహం నుంచి అమ్మవారి ఆభరణాలు, పట్టు వస్త్రాలతో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం సూర్యప్రభ వాహనం మీద పుర వీధుల్లో అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించారు.

- జడ్చర్ల పట్టణంలో సకలదేవతల ఆలయం, గంగాపురం ఎల్లమ్మ దేవాలయం, గొల్లపల్లి లలితాంబికాదేవాలయం, కావేరమ్మపేట ఉత్సవ మండపం, శ్రీనివాస్‌నగర్ బంగారు మైసమ్మ దేవాలయం, హౌసింగ్ బోర్డు కాలనీ, సిగ్నల్‌గడ్డ భవాని ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరిదేవిగా అలంకరించి పూజలు చేశారు. వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని శైలపుత్రిగా అలంకరించారు. ప్రాంగణంలో అర్ధనారీశ్వర ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. గొల్లపల్లి గ్రామ సమీపంలోని శ్రీ లలితాంబిక తపోవనంలో కుంకుమార్చన నిర్వహించారు.
- దేవరకద్ర ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయ ప్రాంగణంలో దుర్గామాతను బాలత్రిపుర సుందరిగా పూజలు చేశారు. ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం, వాసవీ కన్యకాపరమశ్వరి దేవాలయంలో, లక్ష్మీపల్లిలో బాలత్రిపురసుందరిగా అలంకరించి పూజలు చేశారు.
- భూత్పూర్ మున్సిపాలిటీ, మండలంలోని అన్నాసాగర్, రావులపల్లి గ్రామాల్లో దుర్గామాత వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అన్నాసాగర్‌లో ఆంజనేయస్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మంజుల దంపతులు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అమిస్తాపూర్‌లో సాక్షి గణపతి దేవాలయంలో దుర్గామాతకు అభిషేకం, హోమం, కుంకుమార్చన చేశారు.
- నవాబుపేట మైసమ్మ దేవాలయంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. పర్వతాపూర్ మైసమ్మ దేవాలయం సన్నిధికి కాకర్లపహడ్ గ్రామస్తులు పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమాల్లో సుధాకర్‌జీ, అశోక్ గుప్త, నర్సింహులు, లింగం, శ్రీరాములు, బచ్చు రామకృష్ణ, శ్రీనివాస్, వెంకట్ ఉన్నారు.
- మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని శాఖాపూర్, కాటవరం, గుడిబండ, కందూర్, పొన్నకల్, రాచాల, మూసాపేట, జానంపేట, పోల్కంపల్లి, నిజాలాపూర్, సంకలమద్ది, కొమిరెడ్డిపల్లి, వేముల గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు.

దుర్గామాత ఆశీస్సులు అందరిపై ఉండాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఎనుగొండలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, శివరాజు ఉన్నారు.

– మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

అమ్మవారికి ముడా చైర్మన్ దంపతుల పూజలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కోయిల్‌కొండ ఎక్స్ రోడ్డులోని విజ్ఞాన సరస్వతీదేవిని బాలత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. అమ్మవారిని ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, కె.స్వప్న దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఉత్సాహంగా దసరా ఉత్సవాలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



మెమొంటో, సర్టిఫికెట్లు అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం దసరా ఉత్సవాలు ఉత్సాహం.. ఉత్తేజాన్ని నింపాయి. వివిధ కళాశాలల నుంచి విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మలు ఆడడంతోపాటు జానపద, వెస్ట్రన్ నృత్యాలు, కోలాటం చేసి సందడి చేశారు. జానపద నృత్యాలు, బతుకమ్మ, కోలాటాల ప్రదర్శనలను స్థానిక ఎస్సీ హాస్టల్ విద్యార్థినులు, జీఎస్‌ఎం నైటింగల్ కళాశాల విద్యార్థినులు, ప్రముఖ కొరియోగ్రాఫర్స్ రూపొందించిన నృత్యరీతులను వాసవి డిగ్రీ కళాశాల విద్యార్థినులు, బోయపల్లికి చెందిన కళాకారుడు మల్లేష్ డప్పు, కోలాటం నృత్యాలు వీక్షకులను అలరించాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దసరా ఉత్సవాలు జరిగాయి. అనంతరం ఉత్సవాల్లో పాల్గొన్న వారికి మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ముఖ్య అతిథిగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత మాట్లాడారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు బెక్కెం జనార్దన్, సలహాదారులు డాక్టర్ జె.రాంమోహన్, ఉపాధ్యక్షురాలు పులి జమున, పద్మావతి, బెక్కెం సువర్ణ, వి.పద్మ, సహాయ కార్యదర్శులు కురుమయ్య, ప్రమోద్‌కుమార్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



అలంకరించిన బతుకమ్మలతో జర్నలిస్టు కాలనీ ఆడపడుచులు

మెట్టుగడ్డ: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఏనుగొండ జర్నలిస్టు కాలనీలో కాలనీవాసులు, మహిళలు పాల్గొని బతుకమ్మ పండగ ఘనంగా నిర్వహించారు. బతుకునే తల్లిగా భావించే సంస్కృతికి నిలువుటద్దం, ప్రకృతి నుంచి వచ్చే పూలను దేవతగా కొలిచేటువంటి అపురూప వేడుక ఈ బతుకమ్మ పండుగ. ఇందులో భాగంగా తీరొక్కపూలను బతుకమ్మగా పేర్చి మహిళలంతా ఒక్కచోట చేరి ఆటపాటలతో మహిళలంతా ఆనందంగా నిర్వహించారు. మహిళలు పువ్వులతో అందంగా అలంకరించిన బతుకమ్మలను తయారు చేశారు. సాంప్రదాయ దుస్తులతో, బతుకమ్మ పాటలకు ఆడపడుచులందరూ ఉత్సాహంగా నాట్యంతో, ఎంతో ఆధ్యాత్మికతతో జరుపుకున్నారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు, యువతులు పాల్గొన్నారు.

డీసీసీబీలో పారదర్శక పాలన



మాట్లాడుతున్న పోతుల మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రస్తుత పాలకవర్గం బ్యాంకు కష్టమర్లకు పారదర్శకమైన పాలనను అందిస్తుందని సహకార సంఘాల చైర్మన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పోతుల మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పాలకవర్గం తీసుకుంటున్న చర్యల వల్ల డీసీసీబీ ఘననీయంగా అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. నాలుగేళ్లలో కేవలం రూ.236 కోట్ల రుణాలు రైతులకు అందించగా, ప్రస్తుత చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి కేవలం ఒక సంవత్సర కాలంలోనే దీర్ఘకాలిక, స్వల్పకాలిక, ఎడ్యుకేషన్, అర్బన్, రూరల్, హౌసింగ్, పీఎంఈజీపీ తదితర పథకాల ద్వారా రూ.312 కోట్లు ఉమ్మడి జిల్లాలోని రైతులకు అందించారని చెప్పారు. బ్యాంకుపై కొంతమంది తప్పుడు ఆరోపణలు చేస్తూ బ్యాంకు ఖాతాదారులో అభద్రతా భావం కల్పించేందుకు ఇటీవల ప్రయత్నిస్తున్నారని, అలా ప్రయత్నించడం శోచనీయమని అన్నారు. గతంలో బ్యాంకులో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి అవినీతికి పాల్పడి సస్పెండ్ అయిన వారే సోషల్ మీడియాలో, ప్రింట్ మీడియాలో గ్లోబల్ ప్రచారం చేస్తున్నారని, ఇప్పటికైనా వారు బ్యాంకుపై అసత్య ప్రచారాలు మానుకోకపోతే పోలీసు లకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌గౌడ్, బ్యాంకు డైరెక్టర్లు రంగారెడ్డి, భూపాల్‌రావు, వెంకటేశ్ గుప్తా, వంశీధర్‌రెడ్డి, భీంరెడ్డి చైర్మన్లు ఉన్నారు.

అలుగు పారిన వెన్నాచేడ్ పెద్ద చెరువు



అలుగు పారుతున్న వెన్నాచేడ్ పెద్ద చెరువు

గండీడ్: మండలంలోని వెన్నాచేడ్ పెద్ద చెరువు అలుగు పారుతోంది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరద నీరు వచ్చి చేరింది. మండలంలోని 27 గ్రామ పంచాయతీల పరిధిలోని అన్ని చెరువులు, కుంటలు నెల కిందటే పూర్తి స్థాయిలో నిండి అలుగు పారుతున్నాయి.వెన్నాచేడ్ పెద్ద చెరువు మా త్రం పెద్ద మొత్తంలో నీరు చేరినా ఫీటున్నర తక్కువగా ఉండడంతో పూర్తిస్థాయిలో నిండలేదు. ఆది వారం ఊహించని రీతిలో వర్షం పడడంతో వరద ఉప్పొంగి,ఉదయం ఆరు గంటలకల్ల అలుగు పారింది.

నిలిచిన రాకపోకలు..

వెన్నాచేడ్ పెద్ద చెరువు వాగు పొంగిపొర్లడంతో పలుచోట్ల రాకపోకలకు ఆటంకం కలిగింది. రంగారెడ్డిపల్లి నుంచి పరిగి వెళ్లే దారిలో చెల్మిల్లా గేటు సమీపంలో వాగు పొంగిపొర్లడంతో ఉదయం పది గంటల వరకు రాకపోకలు నిలిచాయి. పరిగి నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెల్మిల్లా నుంచి జిన్నారం వెళ్లే దారిలో వెన్నాచేడ్ పెద్ద చెరువుకు వచ్చే వాగు రోడ్డుపై పారడంతో రెండు గ్రామాల మధ్య చాలా సేపు రాకపోకలు నిలిచాయి. సాలార్‌నగర్ ప్రాజెక్టు అలుగు ఉధృతంగా పారడంతో పెద్దవాగు పొంగి పొర్లింది. మండలంలో మిగతా చెరువులు, కుంటలు ఉధృతంగా అలుగు పారాయి.

గంగ పూజ చేసిన గ్రామస్తులు

గండీడ్: చెరువు అలుగు పారడంతో గ్రామస్తులు గంగపూజ నిర్వహించారు. మండలంలోని వెన్నాచేడ్ పెద్ద చెరువు సోమవారం అలుగు పారడంతో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వెన్నాచేడ్ మాజీ సర్పంచులు గోపాల్, పుల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కేశవులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీఎస్పీ కార్యాలయంలో డీఐజీ తనిఖీ

మహబూబ్‌నగర్ క్రైం: పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను పారదర్శకతతో పూర్తి చేయాలని జోగుళాంబ జోన్-7 డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా సోమవారం పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌తో పాటు డీఎస్పీ కార్యాలయంలో డీఐజీ రికార్డులు, కేసు ఫైల్స్ తనిఖీ చేశారు. అన్ని రకాల రికార్డులను సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ గాంధీనాయక్ పాల్గొన్నారు.

నవంబర్ 29న మ్యూజికల్ నైట్

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జెడ్పీహైస్కూల్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నవంబర్ 29న మ్యూజికల్‌నైట్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మల్లెమాల శ్యాంప్రసాద్‌రెడ్డిని ఎమ్మెల్యే కలిసి మ్యూజికల్ నైట్ నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. బాదేపల్లి హైస్కూల్ 100ఏళ్లు పూర్తయిన సందర్భంగా నవంబర్ 27, 28, 29 మూడురోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో చివరి రోజున మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. అందుకోసం శ్యాంప్రసాద్‌రెడ్డిని కలుసుకుని మ్యూజికల్ నైట్ నిర్వహణపై చర్చించి నిర్ణయం వెల్లడించారు. హైస్కూల్ పూర్వ విద్యార్థులతో పాటు నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున మ్యూజికల్‌నైట్‌కు హాజరయ్యేలా కసరత్తు చేస్తున్నారు. మ్యూజికల్ నైట్ నిర్వహణ పట్ల శతాబ్ది ఉత్సవ కమిటీ అ ధ్యక్షుడు బి.రవిశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కృష్ణ, ప్రధాన కార్యదర్శి వెంకటరమణాచార్యులు, ఉపాధ్యక్షులు సత్యం, పెద్దిబాలు, ఇబ్రహీం, వెంకటేశ్, గోపాల్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కంచుకోట ఆనంద్, సంతోష్‌చారి, శ్రీనులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ప్రపంచ నదీ దినోత్సవం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని పాల్కొండ సమీపంలో ఇటీవల గణేశ్ నిమజ్జనం చేసిన చెరువు వద్ద ప్రపంచ నదీ నది దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలిటెక్నికల్, ఎంవీఎస్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు చెరువు సమీపంలో ఉన్న చెత్తాచెదారాన్ని వేరిపారేసి, ప్లాస్టిక్‌ను తొలగించారు. ఏఎన్‌ఓ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజిక బాధ్యతగా చెత్తను తొలగించి, చెరువులు, కుంటలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి వనరులను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐఓ నిరంజన్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు భారీ లైటింగ్ కటౌట్లు

జడ్చర్ల: జడ్చర్ల పట్టణంలో దసరా ఉత్సవాలకు సంబంధించి ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాట్లు సాగుతున్నాయి. అందులో భాగంగా సిగ్నల్‌గడ్డ పై ఆయోధ్య రామమందిరాన్ని తలిపించే విధంగా శ్రీరాములు, ఆంజనేయస్వామి లైటింగ్‌తో ప్రత్యేక త్రీడీ ఎఫెక్ట్‌ను తలపించే మాదిరి భారీ కటౌట్ ఏర్పాటు చేశారు. మరో వైపు మహిషాశుర మర్దిని అవతారంలో అమ్మవారి కటౌట్‌ను ఏర్పాటు చేయడంతో పట్టణంలో ప్రత్యేక ఆకర్షణ చోటు చేసుకుంది. డిగ్రీ కళాశాల మైదానంలో రావణాసురుడు కటౌట్, తదితర ఏర్పాట్లు భారీగా కొనసాగుతున్నాయి. ఇందుకు సంబంధించి దాదాపు రూ.50 లక్షలపైనే ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఉత్సవాలకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

విద్యానిధికి చేయూతనివ్వండి

- ఎమ్మెల్యే యెన్నంశ్రీనివాస్ రెడ్డి



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న న్యాయవాది ప్రతాప్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్యే యెన్నం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అన్ని రంగాల్లోని ప్రముఖులు విద్య నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సోమవారం జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ న్యాయవాది ప్రతాప్ కుమార్ విద్య నిధికి రూ.5 లక్షల విరాళం చెక్కును ఎమ్మెల్యే సమక్షంలో కలెక్టర్ విజయేందిరకు అందజేశారు. విద్య నిధికి వచ్చే ప్రతి పైసా విద్యాభివృద్ధికే ఖర్చు చేస్తామన్నారు. విద్య అభివృద్ధికి ఎమ్మెల్యే చేస్తున్న కృషిని అభినందించాల్సిందేనన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం ఎంతో కృషి చేస్తున్నారని ప్రతాప్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్‌కుమార్ ఉన్నారు.

పల్లెలకు ఆధ్యాత్మిక శోభ



సత్రోనిపల్లితండాలో బంగారు మైసమ్మ సంప్రోక్షణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవాబుపేట: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన చాలా పెరిగిందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సత్రోనిపల్లి తండాలో బంగారు మైసమ్మ దేవాలయంలో సంప్రోక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం మారుమూల గ్రామాల్లోని దేవాలయాలన్ని కొత్త రూపు సంతరించుకుని ఆధ్యాత్మికత పెరిగిందన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన దేవాలయంపై శిఖరం ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ నర్సింహులు, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్, అనంతయ్య, శ్రీనివాస్, నాగిరెడ్డి, ప్రతాప్, రఘుగౌడ్, నరేష్, గోపాల్‌గౌడ్ ఉన్నారు.

వైభవంగా బంగారు మైసమ్మ శిఖర ప్రతిష్ఠ

మండలంలోని కొల్లూర్ పంచాయతీ సత్రోనిపల్లితండాలో బంగారు మైసమ్మ దేవాలయంలో వైభవంగా మహా సంప్రోక్షణ, శిఖరప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో చందర్‌నాయక్, తులసీరాంనాయక్, రాఘవేందర్‌గుప్త, సేవ్యానాయక్, ఖాజా, రఘుగౌడ్, నవాబుపేట మార్కెట్ చైర్మన్ లింగం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, వెంకటయ్య, రమేష్ పాల్గొన్నారు.

గిరిజన నాయకుడి హౌస్ అరెస్టు

నవాబుపేట: లంబాడీల విషయంలో అన్యాయం జరుగుతుందని కొందరు నేతలు ఇతరులను ఎస్‌టీ జాబితాలో చేర్పించి ఇబ్బందులు పెడుతున్నారని, దీనిపై సీఎం నివాసం ముట్టడికి లంబాడి సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. దీంతో సోమవారం మండలంలోని వెంకటేశ్వరతండాకు చెందిన లింబ్యానాయక్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేసి నిర్బంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్బంధాలు ఉద్యమాన్ని ఆపలేవని ఆయన హెచ్చరించారు. రాజ్‌గోండులను ఎస్‌టీ జాబితా నుంచి వెంటనే తొలగించాలన్నారు. దీంతో పాటు కాంగ్రెస్ నాయకులు తెల్లం వెంకట్రావ్, సోయం బాబురావులను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మండలంలోని పలువురు గిరిజన నాయకులను సైతం ముందస్తు అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాల్య వివాహాలపై కళాజాతా



మిడ్జిల్: బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను, మోసాలను తెలుసుకునేల పోలీసు కళాజాతా కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని వల్లభాపురంలో పోలీసు కళాజాతా నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాలు, ఫోన్‌లో వచ్చిన మెసేజ్‌లతో ఇబ్బందులు తదితర వాటిని వివరించారు. సామాజిక రుగ్మతలు వాటి వల్ల జరిగే అనార్థాలను వివరించారు.

అర్ధరాత్రి భారీ వర్షం



లింగంపల్లిలో నీటిలో మునిగిన పామాయిల్ తోట



రేకులచౌడాపూర్‌లో ..

అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి పంటలు నీట మునిగాయి. రెండు గంటల పాటు కురిసిన వర్షం పంటలను, తోటలను ముంచేసింది. తెల్లారే సరికి పంట పొలాలన్ని నీటి కుంటలుగా మారటంతో రైతులు ఆందోళన చెందారు. మండలంలోని లోకిరేవు, లింగంపల్లి, రేకులచౌడాపూర్, కిషన్‌గూడ, కాకార్‌జాల్‌తండాల్లో ఆదివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి వరి పంటలు, పామాయిల్ తోటలు నీటిలో మునిగాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

–నవాబుపేట